

# నాగావళి నవ్వింది

"నాగావళి ఇసుకమేటుని చెరుగుతూ నవ్వుకుంటూన్నట్లుంది కదూ?" అంది మణి రమేశ్‌తో. రమేశ్ గాభరాపడుతూ, మణి ముఖం లోకి లోతుగా గుచ్చి చూశాడు నెమ్మది నెమ్మదిగా. రమేశ్ సన్నని నల్లని చీలికల్లా ఉన్న కళ్లల్లో మంచు బిందువులు కూడుకోవటం మొదలైనాయి. మణి వివశంగా నాగావళిని చూస్తూ కూర్చుంది. జూన్ మూడవ ఆదివారం సాయంకాలం అది నాగావళి కొత్తగా వస్తూంది. అక్కడక్కడ ఉన్న ఇసుకమేటల్ని చెరుగుకుంటూ చిక్కగా, కాఫీరంగులో ఉన్న నీళ్లతో నాగావళి నవ్వుకుంటూ నడుస్తూంది. ప్రవాహంలో ఉద్ధృతం లేదు. కడుపు నిండిన కొండచిలువలాగుంది. మణి, రమేశ్ నాగావళి ఆవలి ఒడ్డున కూర్చున్నారు. ఎదురుగా కోటేశ్వరుని కోవెలమెట్లు ఉన్నాయి. మెట్లమీదుగా ఎందరో స్త్రీలు బిందెలు తెచ్చుకుని నీళ్లు ముంచుకుని ఎక్కుతూ, దిగుతూ కనిపించు

**ఐ. వి. యస్. అచ్యుతవల్లి**

తున్నారు. ఆ స్త్రీలు మణి వాళ్ళు కూర్చున్న చోటికి రంగుసుద్దముక్కల్లా కనిపించుతున్నారు. దూరంగా వంతెన పిట్టగోడమీద కూర్చున్న జనం చీమల్లా ఉన్నారు. అప్పు డొక బస్సూ, అప్పు డొక బస్సూ రొద చేసుకుంటూ వస్తూ పోతూ ఉన్నాయి. నాగావళి! అసురసంధ్య చీకట్లలో, నల్లబడుతూన్న నాగావళిని చూస్తున్నకొద్దీ, రమేశ్‌కి ఎంత మనస్సు దిట్టంచేసుకుంటున్నా, సుభద్ర జ్ఞాపకానికి వచ్చింది. వస్తూంది. సుభద్రకి తాను ఏమీ ద్రోహం చెయ్య లేదు. అనుకోవటానికి అతని సంచేంద్రియాలూ

**మధుపాన్ని పూవు నమ్మదు, మగవాణ్ణి పూబోడి నమ్మదు. మరో అందమైన పూవు గుబాళింపుకు మధుకరుడు ఆకర్షితుడవుతుంటాడు. తీవను వదలిపోలేని పూవు విలపించకపోయినా, సంస్కారం గల మగువ, తాను ప్రేమించిన వాణ్ణి, తనను ప్రేమించిన వాణ్ణి, తనవాడుగా చేసుకోగలదు, కాని కొందరు అలా చేసుకోలేక, వితరణ చూపిస్తే ... అది త్యాగం అవుతుందా!**

ఒప్పుకోటంలేదు! సుభద్ర స్మృతులనించి తను ఎల్లా ఎల్లా దూరం కాగలడు? తన అణువణువునా సుభద్రస్మృతులు ప్రవహించే జీవనదిలా పునర్జన్మలెత్తుతూండగా, తను మణితో తుళ్ళుతూ, కేరింతలాడుతూ సుఖసంసారం ఎల్లా చెయ్యగలడు? చైతన్యదీపిక అయిన మణిని తనలో ఎల్లా జ్వలింపచేయగలడు? 'భగవాన్!' రమేశ్ బాధగా అరచేతులతో రెండు కణతలూ అదిమి పట్టుకున్నాడు.

* * *

జూన్‌నెల మూడవ ఆదివారం సాయంకాలం అది. రమేశ్‌బాబుపక్కన సుభద్ర కూర్చునిఉంది. అరుణవర్ణపు అసురసంధ్యవేళ సుభద్ర రమేశ్ పక్కన కూర్చుంది. సుభద్ర పెద్ద అందగత్తెకాదు. చామనచాయలో పొడుగ్గా ఉంటుంది. సన్నని చిన్నకళ్ళు కోలముఖంలో నల్లగా మెరుస్తూ ఉంటాయి. సన్నగా ఎత్తుగా నుంచునే ముక్కు. నవ్వటం మరిచిపోయినట్లు బిగుతుగా ముడుచుకున్న గులాబీ గన్నేరుమొగ్గలాంటి పెదాలు. తీవ్రంగానే ఉంటుంది సుభద్రముఖం. రమేశ్‌బాబు మంచి పొడగరి. చిలిపిగా చూసే కళ్ళు. చామనచాయకి ఒక చాయ తక్కువగా ఉంటాడు. మంచి చలాకీగా మూర్తీభవించిన నవచైతన్యంతో తుళ్లిపడుతూ ఉంటాడు. నాజూకయిన ఈ అల్లరి బాబుకి, దృఢచిత్త, శీలవతి అయిన సుభద్రకి నేస్తం ఎల్లా కలిసిందో ఆశ్చర్యకరమైన విషయం!

శ్రీకాకుళంలో సుభద్ర టీచరుగా పనిచేస్తూంది. రమేశ్‌బాబు కాకినాడలో ఎమ్. బి. చదువుతున్నాడు. రమేశ్‌బాబు శ్రీకాకుళానికి స్థానికుడు. సుభద్ర వలస వచ్చిన చిన్నది.

"నాగావళి నవ్వుకుంటూన్నట్లుంది కదూ!" అంది సుభద్ర.

"ఏమో? నాకు నవ్వుతున్నట్లు లేదు. ఏడుస్తూన్నట్లుంది" అన్నాడు రమేశ్‌బాబు అల్లరిగా.

"ఏడ్చేవాళ్లకి ఏడుస్తూన్నట్లు, నవ్వేవాళ్లకి నవ్వుతూన్నట్లు ఉంటుందిలే!" అంది సుభద్ర.

"నువ్వో భావుకురాలివి. ఊహాజగత్తులో విహరించే విహంగానివి. లేకపోతే మిట్టల్లోంచి పల్లాల్లోకి పారే జలాన్ని నదీకన్యలనీ, సాగరుని సంగమంకోసం తహతహలాడుతూ పరుగులెడుతున్నాయనీ, నదీకన్యలన్నీ సాగరరాజు ప్రేయురాళ్లనీ వర్ణిస్తారు కదా మీ భావుకుల తరగతికి చెందినవాళ్ళు! మెరకనీరు పల్లానికి ప్రవహించటానికికూడా ఒక పురాణకథని అల్లుతూ విహరిస్తారు భావుకులు!" అన్నాడు రమేశ్.

"రమణీయమైన ప్రకృతిని ఆనందించటానికి ఆ ఉపమానాలన్నీ చెప్పారు కవులు. అయినా స్కెలిటన్లచుట్టూ మూగి దేహశాస్త్రం నేర్చుకునే మీలాంటి షోకిల్లాలకి భావుకత ఏవాడో ఎండిపోయి ఉంటుంది. పాపం, ఏం చేస్తారు?" అంది సుభద్ర.

"ఎండిపోయి ఎండిపోయి నేనో స్కెలిటన్‌ని అయే ప్రమాదం లేకుండా, నీలాంటి పచ్చటి పసిరికలాంటి జీవనాదాన్ని సదా ప్రక్కనుంచుకుందుకు ప్రయత్నిస్తున్నాను కదా!" అన్నాడు రమేశ్‌బాబు.

సుభద్ర మోము అరుణిమతో ప్రఫుల్లమైంది. ఒక విధమైన సుకుమార లావణ్యం ఆమె తనువంతా ప్రదీపించింది.

ఆమె ముఖంకేసి తదేకంగా చూస్తూన్న రమేశ్‌బాబు "నీ మనస్సులోని భావాలు నీ ముఖంలో ప్రతిఫలిస్తాయి. నీ ఊహలను నీ శరీరం దాచదు భద్రీ!" అన్నాడు వివశంగా.

నాగావళి నల్లబడింది. నలువెంపులా చీకట్లు ముసురుకుంటున్నాయి. కుశాలపురంనించి నాగావళి వంతెనమీదుగా జ్యేష్ఠమాసపు చివరమేఘాలు ప్రయాణించుతూ, నాగావళి బురదనీళ్లను తమ చివళ్ళకి పులుముకుంటున్నాయి.

"ఇంక పోదాం పద!" అంది సుభద్ర. ఈ వేసవిలో రెండు నెలలుగా ఇద్దరూ నాగావళి ఇసుకమేటల మీదికి షికార్లు వస్తూనేఉన్నారు. రమేశ్‌బాబు పైకివెళ్లి స్కూటర్ స్టార్ట్ చేశాడు. సుభద్రవెళ్లి వెనకాతల కూర్చుంది. ఇద్దరూ ఊళ్ళోకి వచ్చేరు. సుభద్ర ఇంటిముందు ఆగేరు. సుభద్ర ఇల్లు న్యూకాలనీలో గ్రాండ్‌ట్రంక్ రోడ్డుకి కొస్తదూరంలో ఉంది. చుట్టూ నీలంపువ్వులున్న మొక్కలవరస కంచెగా ఉంటుంది. లోపల చిన్న బంగళా పెంకుటిల్లు. ముచ్చటగా మూడే గదులున్న ఇల్లది. సుభద్ర తలుపు తాళం తీసి లైటు వేశాక రమేశ్‌కూడా లోనికి వచ్చాడు. ముందుగది పొందిగ్గా సర్దిముచ్చటగా ఉంచుతుంది సుభద్ర. నాలుగు కుర్చీలు, ఒక డ్రాయరు, రెండు ఈజీఛైర్లు తప్ప ఇంక ఇతరమైన సామాన్లు ఏవీ లేవు ఆ గదిలో. ఉన్న ఒకే ఒక పెద్ద అలమారులో రెండు అరలనిండా ప్రసిద్ధ కవుల కావ్యాలన్ని వరసగా సర్ది ఉంటాయి.

అడుగు అరలో అద్దం, చిన్న దువ్వెన, స్నో మొదలయిన టాయిలెట్‌సామాన్లు ఉన్నాయి. తలుపు తీసి, లైటు వేయగానే నేలమీద పడిఉన్న పోస్ట్‌కార్డు కనపడింది సుభద్రకి. అది చదువుతూనే ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. రమేశ్ ఆశ్చర్యపోయేడు, ఆమెని అంత ఆనందదీప్తిలో వెలిగించ




గని విషయం ఆ కార్డులో ఏం ఉండిఉంటుందా అని!

"చెల్లి వస్తూందిట రేపు! చెల్లి వస్తూంది!" అంది. రమేశ్ ఇంకా ఆశ్చర్యపోయేడు. తమ మూడేళ్ల సాన్నిహిత్యంలో తన కొక చెల్లి ఉందని మాటవరసకైనా చెప్పలేదు సుభద్ర!

"ఏమిటి, భద్రా! నీ కొక చెల్లాయి ఉందా! ఇన్నాళ్లూ చెప్పావు కాదేం?" అన్నాడు రమేశ్.

"ఏదీ, ఆ మాట మనిద్దరిమధ్యా వస్తే కాదూ చెప్పటానికి? రమేశ్, రేపు మెయిల్‌లో వస్తూంది చెల్లి. మనిద్దరం స్టేషన్‌కి వెళ్దాం. వస్తావు కదూ?" సంభ్రమంగా అంది సుభద్ర.

"ఇన్నాళ్లూ ఎక్కడ ఉందీ?" అన్నాడు జిజ్ఞాసగా రమేశ్.

"అడయారులో ఉంది. దానికి చిన్నప్పట్నించీ లలితకళలంటే ఆసక్తి ఎక్కువ. అందుచేత దానిని అడయారులో నృత్యసంగీతం నేర్చుకుందుకు పంపేశారు మా నాన్నగారు. నాలుగేళ్లయింది నన్ను చూసి. చిన్నప్పుడు ఒకే మంచంమీద పడుకునేవాళ్లం, ఒకే కంచంలో తినేవాళ్లం! దానికి గులాబీలంటే తగని ప్రీతి. మీ తోటలో ఉన్నాయికదూ. రేపు చాలా తెచ్చిపెట్టు. తెస్తావు కదూ?" అంది సుభద్ర.

ఆమెలో పెల్లుబికే ఉత్సాహాన్ని చూస్తూ, "తప్పక తెస్తాను, భద్రా. పట్టమహిషి ఆజ్ఞ మీరగలనా నేను! నాకూ ఒక తమ్ముడుంటే బాగుండుననుకుంటున్నాను భద్రా!" అన్నాడు చిలిపిగా.

రమేశ్‌కి అన్నదమ్ములుకాని, అక్కచెల్లెళ్లుకాని లేరు. లంకంత మేడ, చెరువంత పూలతోటలకు కాపలాదారుగా అమ్మమ్మవరస అయిన జ్ఞానాంబ ఉంటూంది. జ్ఞానాంబకి ఇరస్తూ పరస్తూ ఎవ్వరూ లేరు. రమేశ్‌బాబు పదేళ్ల పిల్లడుగా ఉండగా మాతృవిహీనుడైనాడు. పుట్టీ పుట్టగానే తండ్రిని పోగొట్టుకున్నాడు. ఆ స్థితిలో పాత చుట్టరికాలన్నీ తిరగేసి తిరగేసి జ్ఞానాంబని పట్టుకువచ్చి లంకంత కొంపలో పిచ్చికపిల్లలా ఉన్న రమేశుకి సంరక్షకురాలుగా నియమించారు రమేశ్ ఇరుగుపొరుగూవాళ్లు. ఆమె అంటే రమేశ్‌బాబుకి గౌరవాదరాలున్నాయి.

"ఎందుకూ తమ్ముడు. తగూలాడటానికా?" అంది సుభద్ర.

"ఛ! తగూలాడుకుందుకు నీవు చాలవా ఏమిటి? మీ చెల్లెలికి జతగా ఉండటానికి!" అన్నాడు రమేశ్.

"మా చెల్లెలికి జత ఒకరు పుట్టితీరాలేమిటి? నువ్వు లేవా, నేను లేనా?" అంది సుభద్ర అమాయికంగా!

"మీ చెల్లివస్తే ఇంక నా ముఖం చూడవేమో. రాకరాక వచ్చిన మీ చెల్లి కబుర్లలోపడి నా మాటే ఎత్తవు కాబోలు ఇంక!"

ఈర్ష్యగా అంటూన్న రమేశ్‌ముఖం వెంపుచూసి గలగలా నవ్వింది సుభద్ర.

మరునాడు తెల్లవారకుండా లేచింది సుభద్ర. ఇల్లంతా కడిగిముగ్గులు పెట్టింది. గుమ్మాలకు పసుపు రాసి మామిడాకులతోరణాలు కట్టింది. నాలుగయిదు రకాల తీపివంటలు చేసి డబ్బాల్లో దాచింది. తాను తలనిండా స్నానంచేసి పొడుగాటి జుట్టును ఫాన్‌వద్ద కూర్చుని తడి ఆరబెట్టుకుంటూండగా రమేశ్ వచ్చాడు. బుట్టనిండుకూ రంగురంగుల గులాబీలు తెచ్చాడు.

"ఏమిటి, రాణీగారు ఉషారాగంలో ఉన్నారు! మెయిల్ సాయంకాలం నాలుగింటికికాని రాదని తెలీదా!" అన్నాడు.

"నాకు తెలుసు. నీకే తెలీదు!" అంది సుభద్ర.

"నా కెందుకు తెలీదు?" అన్నాడు రమేశ్.

"తెలిసిఉంటే ఉదయాన్నే గులాబీలన్నీ తెంపుకు వస్తావా?" అంది.

"థాంక్స్ గాడ్! నువ్వేగా గులాబీలన్నీ తెమ్మని చెప్పావు? 'క్షణక్షణంబుల్ జవరాండ్ర చిత్తముల్' అని ఊరికే అన్నారా ఏమిటి!" అన్నాడు.

"తెమ్మన్న మాట వాస్తవమే! కాని సాయంకాలానికి వడిలిపోవూ. చూడబోతే తోటంతా తెంపిపెట్టావు లాగుంది! తీరా అది వచ్చేసరికి ఈ వడిలిపోయిన పూవులా నేను చూపెట్టేది!" అంది విసుగ్గా.

"ఒక గిన్నెలో పెట్టి నీళ్లు చల్లి మూతపెట్టితే వడిలిపోవు, అమ్మగారూ" అంది పనిపిల్ల.

సుభద్ర అల్లానే చేసి వచ్చింది. చిక్కు తీసుకుని, జుట్టంతా వదులుగా జారుముడి వేసుకుంది.

రమేశ్‌చటుక్కున లోపలికి వెళ్లి ఒకే రెమ్మకి పూసివున్న జంటగులాబీలను తెచ్చి సుభద్రముడిలో తురిమాడు.

"ఏమిటాపని!" అంటూ నవ్వింది సుభద్ర. అందులో ఒక పూవు రెమ్మనించి జారి కింద పడింది.

"ఒక పువ్వే దక్కింది నాకు!" అంది సుభద్ర.

"ఈ పువ్వు నాది!" అంటూ కింద రాలిన పూవుని తీసుకున్నాడు.

* * *

మెయిల్‌లో ఫస్ట్‌క్లాస్‌నించి రూపొందిన సౌందర్య ప్రతిమలా, అజంతా శిల్పసుందరిలా దిగుతూన్న నాగమణిని చూసి నిర్ఘాంతపోయేడు రమేశ్. అబ్బ ఎంత సౌందర్యం! పాలమీగడలా, వెన్నెల వెలుగులా, మల్లెల చిరునవ్వుల్లా, విరజాజుల సున్నిత సౌరభంలా, ఏదో ఏదో మాటలకందని అతీతమైన సుందరమూర్తి రమేశ్‌కేసి విస్ఫారితమైన తన పెద్ద పెద్ద నల్లని కళ్లని విప్పిచూసింది నాగమణి. అక్కపక్కన అక్కకన్నా పొడుగ్గా, గౌరవనీయంగా కనబడుతూన్న ఈ వ్యక్తి ఎవ్వరు? అక్క తనకి వ్రాసిన ఉత్తరాల్లో మాటకయినా ఈ యువకుని గురించి ప్రస్తావించలేదేమి?

సుభద్ర నాగమణిని కౌగలించుకుని, గులాబీరంగులో ఉన్న నాగమణి చెక్కిళ్లని గాఢంగా ముద్దాడింది. నాగమణి చెక్కిళ్లు ముద్దమందారాలయినాయి!

"ఈయన రమేశ్‌బాబు. మన శ్రేయోభిలాషి!" అని పరిచయం చేసింది సుభద్ర నాజూకుగా.

"నమస్తే!" చేతులు జోడించింది మణి.

రంగురంగుల గులాబీల చెండు అప్రయత్నంగా మణికి ఇచ్చేశాడు రమేశ్‌బాబు.

"అబ్బ! మీ కెల్లా తెలుసు నాకు గులాబీ లిష్టమని?" అంది మణి.

ఆమె కళ్లల్లో మెరిసే మెప్పుదలకి తబ్బిబ్బు పడ్డాడు రమేశ్‌బాబు!


# వాయిదాలమీద ట్రాన్సిస్టర్



సుప్రసిద్ధమైన కొత్త మాడల్ 'నేషనల్' పోర్టబుల్ 3 బాండ్ల అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్ ఇప్పుడు ప్రతిటౌను, సిటీలో వ్యక్తి హామీమీద నెలసరి రు. 10/— ల వాయిదా చెల్లుబడి మీద లభించును. వివరములకు:

**JAGSON AGENCIES**
**(WAP-25)**
**P.B. 1212, Delhi-6.**

## 1968 లో మీ అదృష్టము

ఏదైన ఒక పుష్పం పేరున్ను, మీ చిరునామాయున్ను వ్రాసిన ఒక పోస్టుకార్డుమాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహం, సౌఖ్యం, మొదలైన వివరములు, దుష్ట గ్రహ పీడ ణలకు శాంతి విధానములతో



పాటు రు. 1-25 పైలకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.

**PT. DEV DUTT SHASTRI**
Raj Jyotshi (A.P.W.)
**P.B. No. 86, JULLUNDUR CITY**

ఇప్పుడే వెలువడింది!!!
నండూరి విఠల్ రచించిన నవల

# — కాల కన్య —

వెలువడిన వెంటనే పాఠకుల్ని అనన్యంగా ఆకర్షించిన అద్భుతమైన నవల. అసలు ధర ఏడున్నర — కాని పాఠకులకు సరాసరి రిజిష్టర్ పోస్టులో (పోస్టు ఖర్చులు మేమే భరించి) ఏడు రూపాయలకే పంపగలం —

మీ కాలకన్య—కై నేడే త్వరపడండి—

మా అడ్రెస్ :—

**చారీ అండ్ కో.,**
**103, సర్దార్ పటేల్ రోడ్,**
**సికింద్రాబాద్**

(KUCHI)

నాలుగయిదు రకాల బట్టలతో పళ్ళూ, కూరలూ తెచ్చింది మణి. రెండు సూట్‌కేసులతో బట్టలు. ఈ సామాన్లన్నీబస్సులో వేశారు, ముగ్గురూకలిసి. స్కూటర్ స్టార్టు చేయబోతూంటే, "అక్కా! ఒంటరిగా నాకు భయం! మీ ఊరు నాకేం తెలుసు?" అంది మణి.

"అయితే మీరు రండి! భద్రి సామానుతో వస్తుంది" అన్నాడు రమేష్.

సుభద్ర, మణితో అల్లా చేయమని చెప్పి, తను బస్సు ఎక్కింది. మణి సంకోచంగా నిలబట్టం చూసి రమేశ్‌బాబు పక్కుమని నవ్వాడు! "రండి. నిలబడి పోయారేం?" అన్నాడు.

సుభద్ర ఎక్కిన బస్సు కదిలింది.

"కాదు! అక్కా... ఒంటరిగా . . ." అంది మణి.

"మీ అక్కని పిల్లి ఎత్తుకపోదు. పదండి. అనవసరంగా లేటయిపోతూంది" అన్నాడు రమేష్.

మణి స్కూటర్ ఎక్కింది. గభాలున గేర్ మార్చాడు రమేశ్. గేర్ మార్చటంతో జెర్క్ ఇచ్చింది. జెర్క్ ఇవ్వటంతో రమేశ్ వీపుకి బలంగా ఆనుకుంది మణి! మణి శరీరం యావత్తూ సిగ్గుతో జలజల్లాడింది. 'తెల్లకుందేలుపిల్లలా ఉంది!' అనుకున్నాడు రమేశ్‌బాబు.

రెండు నిమిషాలలో శ్రీకాకుళంబస్సుని దాటేశారు రమేశ్‌బాబు, మణీనూ!

"ఈడూ జోడూ ఎంతో బాగుంది!" బస్సులో సుభద్ర ఎదురుగా కూర్చున్న ఒక వనిత అంది. వాళ్లని చూసి సుభద్ర నవ్వుకుంది. 'తమ ఇద్దరినీ స్కూటర్‌మీద చూసినప్పుడుకూడా ఇల్లానే అనుకుంటారన్న మాట జనం!' అనుకొని తృప్తిపడింది సుభద్ర.

సుభద్రకి స్కూలు తెరిచేశారు. ఇంక ఒక క్షణం ఖాళీ ఉండటంలేదు. మణికి శ్రీకాకుళం పరిసరాలు చూపెట్టే బాధ్యత రమేశ్‌బాబుమీద పడింది. మణి పదిరోజు లుంటానని వచ్చింది. వెళ్లాల్లయినా వెళ్లలేదు! రమేశ్‌బాబుకి కాలేజీ తీసినా అతను సెలవు పెట్టేశాడు! వాళ్లిద్దరిలో వస్తూన్న మార్పుని సుభద్ర కనిపెట్టలేదు. స్వచ్ఛమైన స్ఫటికహృదయం ఆమెది!

"రమేశ్, అక్క మనసు నవనీతంలాంటిది. మనల్ని ఏమాత్రం శంకించకుండా మనకు పూర్తి స్వేచ్ఛ నిచ్చింది. ఆమె మనల్ని నమ్మినందుకు మనం ఆమెని పూర్తిగా వంచించాము!" నాగావళి ఒడ్డును ఒరుసుకుంటూ ప్రవహించుతూంది. ప్రవాహావేగాన్ని ఎవరు అరికట్టగలరు? మణి కన్నీరుమున్నీరుగా ఏడ్చింది.

"మణీ, సుభద్రని నేను ప్రేమించాను ఒకప్పుడు! అది కాదనలేదు. కాని నిన్ను చూశాక నాకు నీవు తప్ప ఇతరమైన వస్తువులు ఏవీ కన్పించటంలేదు. నేనేం చేయగలను చెప్పు మణీ! ఎప్పుడూ నీ సాన్నిధ్యమే కోరుతూంది నా మనస్సు. నీవు కాదంటే, నాగావళే నాకు శరణ్యమవుతుంది. నా ప్రేమ ఇంత ప్రగాఢమైందని నాకే ఇంతవరకూ తెలీలేదు. నీవే ఎందుకు ముందు నాకు కనబడలేదు? చెప్పు మణీ. ఇది నా తప్పా? సుభద్ర నా కెప్పుడూ దేవతలానే కనపడుతుంది. ఇంత ఆరాధనీయమైన వస్తువుని నాకు సమర్పించిన సుభద్ర నాకు దేవతకాక వేరెవరు? నాకు తోడూ నీడా ఎవ్వరూ లేరు. నాకోసం నేడి కన్నీటి బొట్టు విడిచేవాడనికికూడా ఒక్క బంధువు లేరు. సుభద్రని చూస్తే, నా కిప్పుడు నిజంగా...నిజంగా... పెద్దక్కలా కనపడుతూంది! ఆమెపట్ల గౌరవం ఉంది; వాత్సల్యం ఉంది; ఆప్యాయత ఉంది. కాని భార్యగా, సహచరిగా చూడగల్గిన మోహావేశం కలగదు. మా సాన్నిహిత్యం చూసి ప్రజలు మమ్మల్ని ప్రేమికులు అనుకొనిఉంటారు. కాని నీమీద ఒట్టువేసి చెబుతున్నాను. నే నెప్పుడూ అల్లా అనుకోలేదు. మణీ, నువ్వు నన్ను కాదనకు!", మణి అరచేతుల్లో తన ముఖం దాచుకుని భోరుమని చిన్నపిల్లాడిలా విలపించాడు రమేశ్.

"నాకు నీ మనసు తెలుసు, రమేశ్! కాని, అక్కని నేను నడిసాగరంలో వదిలిపెట్టలేను. నాకు ఉన్న ఒకే ఒక సోదరి జీవితానందాన్ని నేను లాక్కోలేను, రమేశ్! భగవంతు డెందుకు పుట్టించాడు నన్ను!" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది మణి.

చీకటి పడినాక—

నెలజీతం అందుకుని మణికి ఎంతో ఇష్టమయిన ఎరుపురంగు ధర్మవరం పట్టుచీర, నీలంరంగు బ్లౌజ్ పీసూ, గులాబీలూ, పనసతొనలూ కొని ఇంటికి వచ్చిన సుభద్ర, తమ ఇంటిలో ఇంకా లైటు వేయకపోవటం చూసి ఇద్దరూ ఎక్కడికయినా వెళ్లినా రేమో అనుకొంది. తలుపులు దగ్గరగా జేరవేసి ఉన్నాయి. మెట్లమీద తాను తెచ్చిన సామాన్లు పెట్టింది. కిటికీలోంచి ఇద్దరినీ చూసి నిశ్చేష్టురాలయింది! ఒకళ్ల చేతుల్లో ఒకళ్ళ ముఖాలు పెట్టుకుని దీనంగా రోదిస్తూన్న ఆ చిన్నవాళ్లని చూడగానే సుభద్ర హృదయం ద్రవించిపోయింది. ఆమెకి సంగతి అంతా విదితమైంది. క్షణంలో ఆమె గుండెల్లో అంతా సన్నగా బాధ మొదలయింది. 'ప్రేమ ఇంతగా త్యాగం కోరుతుందని తనకి తెలీదు! ఇప్పుడు అనుభవమైంది తనకి! స్వసుఖమా, చిన్నారి చిట్టిచెల్లెలి సుఖమా తనకి కావలిసింది? రమేశ్ ఇంత హృదయం లేనివాడయినాడేమిటి? అబ్బా!' అనుకొంది. వెనుతిరిగింది. గబగబా నడిచింది.

మెట్లమీద అడుగుల చప్పుడుకి రమేశ్‌బాబూ, మణీ ఉలిక్కిపడ్డారు. గబగబా లైటు వేశారు. తలుపు తీశారు. ఎదురుగా బట్టల పాకెట్టుకి గుచ్చిన చిన్న చీటీ, గులాబీలూ — పనసతొనలూ. పనసతొనలూ, ఎర్రని గులాబీలూ — సౌఖ్యమూ త్యాగమూ కలగాపులగంగా నిర్మితమై ఉన్నట్లు దర్శనమిచ్చాయి!

"అమ్మయ్యో! అక్కా!" అంటూ రోడ్డుమీదకు పరిగెత్తబోయింది మణి. రమేశ్‌బాబు బలమైన చేతులు మణిని ఒక్క అడుగైనా కదలనీయలేదు. మౌనంగా లోపలికి నడిపించాడు.

"రమేశ్‌బాబూ! మగవాళ్లూ మధుపాలూ అన్న పూర్వోక్తిని మీరు నిజం చేయకండి. నా అన్నవాళ్ళు లేని అనాథ మా చిట్టిచెల్లి. మీకు అప్పగిస్తూ నా గమ్యాన్ని నేను వెతుక్కుంటున్నాను. నా విన్నపాన్ని మన్నిస్తారని ఆశిస్తూ...

మిమ్మల్ని వేడుకునే అర్హత లేని

—సుభద్ర."

రమేశ్‌బాబు గబగబా స్కూటరు బయటకు తీశాడు. వెనక వచ్చి కూర్చుంది నాగమణి. నాగావళి ఒడ్డుకి పోనిచ్చాడు. వంతెన దాటకుండానే విజయనగరం బస్సు రయిమంటూ పోయింది. బస్సులోంచి ఆ రోజు సుభద్ర ధరించిన నల్లని చీరచెంగు బయటకు కన్పించిందదని మణి. ఇద్దరూ ఆదరబాదరగా నాగావళి దాటి విజయనగరం చేరారు. కాని సుభద్ర కన్పించలేదు! పేపర్లో క్షమార్పణలు కోరుతూ తిరిగిరమ్మని ప్రకటనలు వేశాడు రమేశ్‌బాబు. కాని ఫలితం మటుకు సర్వశూన్యంగానే వుంది అప్పటికీ, ఇప్పటికీ కూడా. సుభద్రజ్ఞాపకాలు రమేశ్‌బాబు మనస్సుని చీపురుముల్లులా గుచ్చుతూనే వున్నాయి.

వాళ్ళు సుభద్ర ఉనికిని తెలుసుకుందుకు చేసిన నిష్ఫల ప్రయత్నాలన్నింటినీ వింటూన్న నాగావళి మటుకు తనలో తను నవ్వుకుంటూనేఉంటుంది! చీకట్లలో నల్లబడుతూనేఉంది! ★


వాయిదాలమీద ట్రాన్సిస్టర్



రు. 320/—ల ఖరీదుగు ప్రపంచ ప్రసిద్ధమైన "టెలి-క్వీన్" 3 బాండ్ల అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను రు. 10/- ల అల్పమొత్తపు నెలసరి వాయిదాలమీద పొందండి. వెంటనే వ్రాయండి:

ATLASCO (APWM-22),
P.O. Box 1329, Delhi-6.

లాభదాయకం అధునాతనం అయిన చిన్న తరహా
కుటీర పరిశ్రమ కొద్ది పెట్టుబడితో ప్రారంభించండి

కొద్ది పెట్టుబడితో పూర్తి కాలికంగాకాని, సహాయపరిశ్రమగాకాని, లఘు పరిశ్రమ ప్రారంభించదలచుకున్నవారు 'అధునాతన కుటీర పరిశ్రమలు' అను తెలుగు గ్రంథాన్ని (రెండవ ముద్రణ) చదవాలి. లాభదాయకమైన లఘుపరిశ్రమలు, ముడిపదార్థాలుదొరుకుచోట్లు, యంత్రాలను వాయిదాల పద్ధతిని తెప్పించుకోవడం, లఘు పరిశ్రమలకు ప్రభుత్వ సహాయం వగైరా విన్నో విషయాలు దీనిలో ఉన్నాయి. 960 పుటలు, 350 బొమ్మలు, గుడ్డ బైండ్ ప్రతి ధర రూ. 15—50, తపాల ఖర్చు రూ. 2—00, ఇతర ప్రతులు: ఇంగ్లీష్, మరాటీ రూ. 15—50, హిందీ, తమిళం రూ. 16—00.

COTTAGE INDUSTRY (ASM-101) P.B. 1262, Behind Recruiting office, Near Red Fort, Subhas Marg, Delhi-6. Telephone: 262835.